క్లుప్తంగా

అందుబాటులో విత్తనాలు

మాగనూర్: మండల కేంద్రంలోని రైతు ఆగ్రో సేవ కేంద్రంలోని వరి, కంది పేసర్లు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏఈఓ హరీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ఎన్ఆర్ 15048 రకం 25కేజీల బస్తా రూ.1094, బీపీటీ 5204 రకం 25 కేజీల బస్తా రూ. 1030, కేఎన్ఎం 1638 రకం 25కేజీల బస్తా రూ. 995, పేసర్లు కేఎస్-11రకం 4 కేజీలు రూ. 650, కందులు టీఎస్3ఆర్ 1 కేజీ రూ. 250లగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల రైతులు రైతు ఆగ్రోస్ కేంద్రం నందు సంప్రదించాలని అన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



మాగనూర్: మండల కేంద్రంలోని మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏకలవ్య స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు విశ్రాంత పీఈటీ బి.గోపాలం రూ. 5వేలు విలువ చేసే క్రీడా దుస్తులను వితరణ చేశారు. ఈ మేరకు.. పాఠశాల బి. దీప మాట్లాడుతూ.. విద్యార్థులకోసం ఏకలవ్య స్పోర్ట్స్‌క్లబ్ వారు ముందుకొచ్చి తమ వంతుగా 20మంది విద్యార్థులకు దుస్తులను అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యం వెలికితీసేందుకు ఇలాంటి అవకాశాలు తోడ్పాటునందిస్తాయని ఆమె అన్నారు. విద్యార్థులు కూడా ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కష్టపడాలని తెలిపారు. కార్యక్రమంలో ఏకలవ్య స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు విశ్రాంత పీఈటీ బి. గోపాలం తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ లేక ఇబ్బందులు



మరికల్: మండలంలోని కూరగాయల మార్కెట్ లేక వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ఎదుట ఉన్న ప్రభుత్వ స్థలంలో కూరగాయాల మార్కెట్ నిర్మిస్తామని చెబుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారుల మాటలు నీటి ముఠాలుగా మిగిలిపోతున్నాయి. దీంతో వ్యాపారులు చేసేది లేక వర్షానికి తడుస్తు, ఎండలకు ఎండుతు అక్కడే సంతను కొనసాగించడంతో స్థలం సరిపోక ఇబ్బందులు తప్పడం లేదు. ఎమ్మెల్యే స్పందించి వెంటనే నిధులు మంజూరుచేసి కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టాలని వ్యాపారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మాణం జరిగేనా?



మరికల్: మండలంలోని పస్పుల శివారులో నిర్మిస్తున్న నూతన కస్తుర్బా గాంధీ పాఠశాలకు ప్రహరీ నిర్మాణ పనులు సమస్యాత్మకంగా మారాయి. పస్పుల శివారులో ప్రభుత్వ స్థలంలో 4.20 ఎకరాల భూమిని అధికారులు కేటాయించారు. అయితే వచ్చే విద్య సంవత్సరం ప్రారంభించాలని అధికారులు ప్రయత్నం చేస్తుండగా మరో పక్క ప్రహరీ లేకుండా పాఠశాలను ప్రారంభించలేమని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ భూమి తమదంటు కొందరు వ్యక్తులు ప్రహరీ నిర్మాణ పనులకు ఆటంకం కల్గిస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి మరోసారి స్థలాన్ని సర్వే చేయించి చుట్టు ప్రహరీ నిర్మాణ పనులు జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వాసవీమాతకు వార్షికోత్సవ పూజలు

దామరగిద్ద: మండల కేంద్రంలోని నగరేశ్వర ఆలయంలో వాసవీ కన్యకాపరమేశ్వరీ ప్రతిష్ఠాపన ఏడో వార్షికోత్సవ ఉత్సవాలను బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం వాసవిమాతకు అమృతాభిషేకం, హోమం, కుంకుమార్చన మహామంగళహారతి, ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మహిళలు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



డ్రైయినేజీలు లేక ఇక్కట్లు

- రోడ్డుపై పారుతున్న మురుగు
- కోతకు గురవుతున్న రహదారి
- పట్టించుకోని అధికారులు

దామరగిద్ద: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ చేపట్టిన ఇరువైపుల మురుగునీటి పారుదలకు కాల్వల నిర్మాణం చేపట్టకపోగా వర్షాకాలం ప్రారంభం కావడంతో మురుగునీరు పారుదల అస్తవ్యస్తంగా మారనుంది. గత ప్రభుత్వం దామరగిద్ద నుంచి యానగుంది వరకు 11.5 కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ. 13కోట్ల నిధులతో అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఏడేళ్ల క్రితం 10.08 కిలో మీటర్ల రోడ్డు విస్తరణ పూర్తి చేశారు. దామరగద్దలో సంజీవరాయ చౌరస్తా నుంచి గ్రామ పంచాయతీ వరకు 700 మీటర్లు రోడ్డుకు ఇరువైపుల ఇండ్లు ఉండటంతో గత ఏడాది స్థానిక ప్రజాప్రతినిధులు చొరవతో పంచాయతీ తీర్మానం ద్వారా ప్రభుత్వం అందించే డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీలో ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇవ్వడంతో స్వచ్ఛందంగా రోడ్డు విస్తరణకు స్థలాలు వదలి సహకరించారు. ఆర్అండ్‌బీ రోడ్డు కావడంతో ఎస్టిమేషన్‌లో సైడ్ డ్రైయినేజీ లేదని కాంట్రాక్టర్ రోడ్డు మాత్రమే చేపట్టి, మురుగు కాల్వల నిర్మాణం వదిలేశారు. కాగా స్థలాలు ఇళ్లు కోల్పోయిన వారికి మాత్రం ఎలాంటి సాయం అందించలేదు.



సైడ్ డ్రైన్ లేక కోతకు గురువుతున్న రోడ్డు (ఫైల్)

కోట్ల నిధులతో నిర్మించిన రోడ్డు..

రోడ్డుకు ఇరువైపులా మురుగుకాల్వల నిర్మాణం చేపట్టక పోవడంతో ఇటు ఇళ్లనుంచి వచ్చే మురుగునీటితోపాటు వర్షాకాలం వచ్చే వృథానీరు రోడ్డుకు ఇరువైపుల ఉన్న కాల్వలు, రోడ్డు కోతకు గురయ్యే అవకాశం లేకపోలేదు. కోట్ల నిధులతో నిర్మించిన రోడ్డు నష్టపోవడంతోపాటు వర్షం నీరు ఇళ్లలోకి వచ్చే అవకాశం ఉన్నందున రోడ్డుకు ఇరువైపుల ఉన్న స్థానికులు వాపోతున్నారు.

సీడీపీ నిధులు మంజూరు..

గతంలో ఉన్న మురుగు కాల్వలు పూడిపోయి మురుగునీరు రోడ్డుపై పారుతుంది. రోడ్డుకు ఇరువైపుల మురుగునీరు నిలిచి దుర్గంధం నెలకొనడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక నాయకుల చొరవతో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి గ్రామంలోని వివిధ అభివృద్ధి పనులకు రూ. 70 లక్షలు మంజూరు చేయగా ప్రధానంగా రోడ్డుకు ఇరువైపుల మురుగుకాల్వల నిర్మాణానికి సీడీపీ నిధుల నుంచి రూ. 20 లక్షల నిధులు కేటాయించినట్లు సమాచారం.

ఇంటి ముందే మురుగు పారుతుంది..



రోడ్డు నిర్మాణం సమయంలో ఉన్న కొద్ది ఇల్లు సగం వరకు కూల్చారు. ఒకేగదిలో నివసిస్తున్నాం. రోడ్డుకు ఇరువైపులా డ్రైయినేజీ నిర్మించకపోవడంతో ఇంటిముందే మురుగునీరు పారుతుంది. వర్షం నీరు వస్తే కాల్వలో దిగి ఇంట్లోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుంది. వెంటనే డ్రైయినేజీ నిర్మించి వానాకాలంలో ఈగలు, దోమలు బారిన పడకుండా చూడాలి.

-లక్ష్మి, దామరగిద్ద

డ్రైయినేజీ నిర్మించాలి..



డబుల్‌రోడ్డు విస్తరణ చేపట్టి ఏడాది గడుస్తున్న సైడ్ డ్రైయినేలు నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం సమీపిస్తుండటంతో మురుగునీరు ఇంటి గుమ్మాల్లోకి వచ్చే అవకాశం ఉంది. త్వరగా కాల్వల నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరైన పనులు మాత్రం చేపట్టడం లేదు.

- నాగేందర్, దామరగిద్ద

ఎలాంటి సమాచారం లేదు

ఆర్ అండ్ బీరోడ్డుకు ఇరువైపుల సైడ్ డ్రైయిన్‌ల నిర్మాణానికి నిధులు కెటాయింపుపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. ఎన్నికల కోడ్ అనంతరం అభివృద్ధి పనులకు చెందిన ప్రతిపాదనలు ప్రొసీడింగ్స్‌లు వచ్చే అవకాశం ఉంది. రోడ్డు పక్కన సీసీ డ్రైయిన్‌ల నిర్మాణానికి సంబంధించి నిధులు మంజూరైనట్లు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదు.

-నర్సింగ్ రావు, పీఆర్ఏఈ, దామరగిద్ద

డీఈఓకు వినతి

నారాయణపేట రూరల్ : ఈ విద్యా సంవత్సరంలో 6,7 తరగతులకు భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు గణితం చెప్పాలని ఇచ్చిన అసమంజసమైన ఆదేశాలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సైన్స్‌ఫోరం ఆధ్వర్యంలో డీఈఓ ఎండీ అబ్దుల్ ఘనికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డీఎస్ఓ భానుప్రకాష్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కేటాయించిన 8, 9, 10వ తరగతులకు బోధిస్తున్న భౌతిక శాస్త్రం పీరియడ్లు సరిపోక అదనపు తరగతులు తీసుకుంటున్న తరుణంలో 6,7 తరగతులకు గణితం బోధించాలని చెప్పడం సరికాదన్నారు. సక్సెస్‌పాఠశాలలో ఆంగ్లం, తెలుగు రెండు మాధ్యమాల్లో బోధిస్తూ ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కొనసాగుతున్న ఆర్‌సీ నెం.77ను అలాగే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఓ శ్రీనివాస్, ఏజీసీ రమేష్‌శెట్టి, టీచర్లు మహేష్‌సగర్, శ్రీనివాస్, సక్సెనా, రాములు, జయంత్, మాణిక్యప్ప పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న సైన్స్ టీచర్లు

నర్సరీ పరిశీలన



మద్దూర్: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీలో బుధవారం ఏపీఓ సిద్దేశ్వర్ నర్సరీని పరిశీలించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన నర్సరీలో అందుబాటులో ఉన్న మొక్కల వివరాలు తెలుసుకున్నారు. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో నిర్దేశిత లక్ష్యం మేరకు నర్సరీలో మొక్కలను పెంచి పంపిణీ చేయాలన్నారు. నిర్ణిత కొలతల మేరకు కేటాయించిన సమయం ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 కూలీ వస్తుందని ఉపాధి కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సిద్దేశ్వర్‌తోపాటు పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్ కేశవులు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఒండ్రుమట్టి పనులు

మాగనూర్: చెరువు మట్టి చేనులకు పుష్టి అని మండల ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్ అన్నారు. బుధవారం మాగనూర్‌లో పెద్ద చెరువు నుంచి ఉపాధిహామీ కింద కూలీల ద్వారా ఒండ్రు మట్టి తరలింపు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. సేంద్రియ పదార్థాలు, సూక్ష్మ పోషకాలు అంతకంతకూ పడిపోతున్నాయని భూమిలో పోషక సామర్థ్యం పెంచేందుకు చెరువు మట్టి వాడడమే ఏకైక మార్గం అన్నారు. రసాయనిక ఎరువులకు మించి పోషకాలు చెరువు మట్టిలో ఉంటాయని రైతులు తమ పంటల పొలాలకు ఒండ్రు మట్టిని తరలించుకోవాలని కోరారు.



ఒండ్రుమట్టి పనులు సాగిస్తున్న కూలీలు

నేడు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కోస్గి: పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల ప్రాంగణంలో నేడు గురువారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు. షిర్డిసాయి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సులో రైతులకు ఆర్గానిక్ ఫామింగ్ (ప్రకృతి వ్యవసాయ) పై నిపుణులతో అవగాహన కల్పిస్తామన్నారు. పలువురు జిల్లా వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులతోపాటు ప్రకృతి వ్యవసాయ నిపుణులు హాజరవుతారని తెలిపారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు

ధన్వాడ: మండలంలోని బుధవారం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనా విద్యార్థులు క్యాంప్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు. కోచ్ డాక్టర్ రామ్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా నెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30నుంచి 1వ తేదీ వరకు గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యూకేషన్ దోమలగూడలో జరిగే 7వ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలలో పాల్గొనేందుకు పురుషులు, మహిళ జట్లు ప్రయాణమయ్యారని తెలిపారు. ఇందులో ఎంపికైన వారు జాతీయ స్థాయిలో ఎంపికవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్‌శెట్టి, రమేష్, సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో హెచ్ఎం రమేష్, కోచ్ రామ్మోహన్‌గౌడ్

మహిళ అదృశ్యం

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లికి చెందిన కుర్వ పద్మమ్మ ఆదివారం సాయంత్రం నుంచి కనబడట్లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పామిరెడ్డిపల్లికి చెందిన కుర్వ నాగమల్లయ్య, పద్మమ్మ దంపతులు. పద్మమ్మ ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిందని కుమారుడు శివ తెలిపాడు. పద్మమ్మ ఆచూకీ తెలిస్తే 84669 36959 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.

వేరుశనగ విత్తనాల కోసం అవస్థలు

- స్థానికంగా అందుబాటులో ఉంచని వ్యవసాయాధికారులు
- రూ.వేలు వెచ్చించి రాయచూర్ మార్కెట్‌లో కొనుగోలు

మక్తల్: మండల రైతులు వేరుశనగ విత్తనాలు దొరక్క తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంటను సాగు చేసేందుకు రైతులు తమ పొలాలను సిద్ధం చేసుకొని సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయం వ్యవసాయ శాఖ అధికారులకు తెలిపినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో రాయచూరు మార్కెట్‌లో క్వింటాలు వేరుశనగ విత్తనాలు రూ.8- 10 వేల చొప్పున కొనుగోలు చేస్తున్నామని బాలప్ప, తిమ్మప్ప పేర్కొన్నారు. అధికారులు స్పందించి వెంటనే మండలానికి కావాల్సిన వేరుశనగ విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా అందజేస్తే రైతులకు అనుకూలంగా ఉంటుందన్నారు. విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విత్తనాలు సరఫరా చేయాలని కోరుతున్నారు.



మాద్వార్ శివారులో విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసిన పొలం (ఫైల్)

వేరుశనగ విత్తనాలను పంపిణీ చేయండి

వేరుశనగ విత్తనాలను వేసేందుకు పొలాలను సిద్ధం చేశాం. అనుకులమైనా సమయంలో పంపిణీ చేస్తేనే బాగుంటుంది. రైతులపై శ్రద్ధ వహించి విత్తనాలను పంపిణీ చేయాలని కోరుతున్నాం. రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- అరికెరి సవరప్ప, మాద్వార్

అప్పులు తెచ్చి విత్తనాలు కొంటున్నాం..



విత్తనాలను కొనుగోలు చేసేందుకు అప్పుతెచ్చి కొంటున్నాం. కర్ణాటక ప్రాంతం నుంచి అధిక ధరలకు కొనుగోలు చేసుకుని పొలాల్లో విత్తనాలు వేస్తున్నాం. అధికారులు స్పందించి సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేయాలి.

- నర్సింహులు, ముస్టిపల్లి

చర్యలు తీసుకుంటాం..

రైతులకు వేరుశనగ విత్తనాలు అవసరమని ఉన్నతాధికారులకు నివేదికలు తయారుచేసి అందజేశాం. ప్రభుత్వం నుంచి విత్తనాలు సరఫరా చేస్తే రైతులకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటాం.

- నితిన్‌చక్రవర్తి, వ్యవసాయ అధికారి, మక్తల్

విత్తనాల కొనుగోలుపై అవగాహన



ధన్వాడలో రైతులకు వివరిస్తున్న జాన్ సుధాకర్



ఎర్లాట్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న ఏఓ



కున్సిలో..

ధన్వాడ: మార్కెట్‌లో కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు అమ్ముతూ రైతులను మోసం చేస్తున్నారని వీటిపై రైతులు జాగ్రత్త వహించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్ అన్నారు. బుధవారం మండలం కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. రైతులు విత్తనాల కోసం వ్యవసాయశాఖ అనుమతులు ఉన్నా దుకాణంలోనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఎక్కడా కూడా ప్యాకింగ్ లేకుండా లూజ్ విత్తనాలు విక్రయిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సైమన్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని ఎర్లాట్‌పల్లి, పులిమామిడి గ్రామాల్లో బుధవారం ఏఓ అరవింద్‌కుమార్ విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు.. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి వివరించారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని విధిగా రసీదులు తీసుకోవాలని సూచించారు. తక్కువ ధరకు వస్తున్నాయని గ్రామాల్లో విక్రయించే నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి నష్టపోవద్దని ఆయన రైతులకు సూచించారు. గడువు దాటిన విత్తనాలను ఎట్టి పరిస్థితిలో కొనొద్దని విత్తన ప్యాకెట్‌లపై ముద్ర సరిచూసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతులు మల్లేష్, రాజు, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని కున్సిలో బుధవారం ఏఈఓ మోహన్ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతులు పత్తి విత్తనాలు కొనే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని, అలాగే గుర్తింపు పొందిన ఎరువుల దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ బండారు ఉత్సవాలు

నర్వ: మండల కేంద్రంలోని బుధవారం రేణుక ఎల్లమ్మ బండారు ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. నూతన ఆలయం నిర్మాణం తర్వాత జరిగే ఈ ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి హాజరై ఎల్లమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారికి స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. గ్రామంలోని ఉత్సవాల సందర్భంగా బండారు చల్లుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మేకలు, గొర్రెలను బలి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, శరణప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వివేక్‌వర్ధన్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

కోయిల్‌కొండ: మండలంలోని కొత్లాబాద్ ఉన్నత పాఠశాలలో (2004-2005 పదోతరగతి) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అప్పటి గురువులు రిటైర్డ్ జీహెచ్ఎం కృష్ణయ్య, లక్ష్మణ్, సురేఖ, భీమయ్యలను ఘనంగా సన్మానించారు.

విద్యను వ్యాపారంగా మార్చుతున్నారు: సీఆర్ఓ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: విద్యావ్యవస్థను ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు వ్యాపారంగా మార్చుతున్నాయని కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ (సీఆర్ఓ) జిల్లా అధ్యక్షుడు బూనీడు బాలరాజు ఆరోపించారు. ప్రైవేట్ స్కూల్ ఫీజులను నియంత్రించాలంటూ బుధవారం కలెక్టరేట్‌లో డీఈఓ రవీందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఏటా ఫీజులు పెంచుతున్నా యని అందులో పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతున్న పాఠశాలలోనే పుస్తకాలను విక్రయిస్తున్నారని, వారు నిర్ణయించిన రుసుము చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. అలాగే యూనిఫాంను సైతం తమ వద్దే కొనాలని ఇబ్బందులు పెడుతున్నారని ఆయన విజ్ఞప్తి చేశారు.



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఆర్ఓ నాయకులు

317 జీఓ బాధితులకు న్యాయం చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం గతంలో చేపట్టిన 317 జీఓలో భాగంగా 13 జిల్లాల బాధితులకు వెంటనే న్యాయం చేయాలని కోరుతూ టీపీఆర్‌టీయూ నాయకులు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. గత సెప్టెంబర్‌లో జరిగిన బదిలీల్లో ఇంకా రిలీవ్‌కాని ఉపాధ్యాయులకు రిలీవ్ ఇవ్వాలని, మాడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టాలన్నారు. ఎన్నికల కోడ్ వల్ల నిలిచి పోయిన జోన్-2 పదోన్నతులను వెంటనే చేపట్టాలన్నారు. 2010 కంటే ముందు నియామకాలు జరిగిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ విద్యాసంవత్సరంలో పండిట్, పీఈటీలకు అప్‌గ్రేడేషన్ చేయాలన్నారు. వ్యవస్థాపక, గౌరవ అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆలయ పరిసరాల్లో తొలగని వ్యర్థాలు

అమరచింత: పట్టణంలోని సవారమ్మ ఆలయం ఆవరణలోని కోళ్ల వ్యర్థాలు తొలగించకపోవడంతో ఆలయ పరిసరాలు దుర్గంధంగా తయారయ్యింది. మంగళవారం సవారమ్మ జాతర సందర్భంగా పట్టణ ప్రజలు అమ్మవారిని దర్శించుకుని కోళ్లను బలిచ్చి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాల్లోనే కోళ్ల వ్యర్థాలను పారవేయడంతో పరిసరాలంతా కోడి ఈకలు, రక్తపు మరకలతో నిండుకున్నాయి. దీంతో కుక్కలు సైతం అక్కడే ఉంటూ కోళ్ల వ్యర్థాలను తింటూ ప్రదాన రహదారిపై ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులపై ఎగబడుతున్నాయి. మున్సిపాలిటీ అధికారులు ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించకపోవడంతోనే ఆలయ పరిసరం అధ్వానంగా తయారైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.



ఆలయ పరిసరాల్లో కోళ్ల వ్యర్థాలు